# నిర్మల్ సస్యశ్యామలం

## సీఎం కేసీఆర్ చొరవతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం

- రూ.714 కోట్లతో కాళేశ్వరం హై లెవెల్ కాలువ నిర్మాణం
- నిర్మల్ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలు సస్యశ్యామలం
- రూ.600 కోట్లతో సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం
- మిషన్ కాకతీయ కింద రూ.74 కోట్లతో 179 చెరువుల పునరుద్ధరణ
- రూ.76 కోట్లతో స్వర్ణ వాగుపై 13 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం
- రూ.1,160 కోట్లతో 400 కేవీ సబ్ స్టేషన్
- రూ.32 కోట్లతో 15 సబ్‌స్టేషన్ల నిర్మాణాలు
- నెరవేరిన మెడికల్ కాలేజీ కల


స్వర్ణ వాగులో నిర్మించిన చెక్‌డ్యామ్

### అభివృద్ధి పనులు..

- రూ.5.18 కోట్లతో నిర్మల్ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు
- రూ.5.20 కోట్లతో పట్టణంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- రూ.2 కోట్లతో ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు
- రూ.3 కోట్లతో డివైడర్ల మధ్యలో గ్రీనరీ
- రూ.4.40 కోట్లతో నిర్మల్‌లోని చెరువుల సుందరీకరణ
- రూ.2.73 కోట్లతో వైకుంఠధామాల నిర్మాణం
- రూ.30 లక్షలతో ఎన్టీఆర్ మినీ స్టేడియం అభివృద్ధి
- రూ.300 కోట్లతో సోన్ మండలం పాక్‌పట్ల వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన
- రూ.10.15 కోట్లతో నిర్మల్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.166 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు
- రూ.22.15 కోట్లతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 16 సబ్ స్టేషన్ల ఏర్పాటు
- రూ.690 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో 655 రోడ్ల నిర్మాణం
- రూ.12.90 కోట్లతో 2,500 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు.
- రూ.74.27 కోట్లతో 179 చెరువులను పునరుద్ధరించారు.
- కొత్తగా ఏర్పాటు చేసిన రెండు మైనారిటీ గురుకులాల్లో 790 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు
- 4 బీసీ గురుకులాల్లో 1,596 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.
- 'మన ఊరు-మన బడి' కింద రూ.27.90 కోట్లతో 93 ప్రభుత్వ బడులను ఆధునీకీకరించారు.

నిర్మల్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ) : రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతమైన నియోజకవర్గంగా పేరున్న నిర్మల్‌లోని గ్రామీణ వ్యవస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. సాగునీరు, కరెంటు సమస్యలతో అన్నదాతలు దశాబ్దాలుగా అవస్థలు పడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే సీఎం కేసీఆర్ సాగునీరు, కరెంటు రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వడం వరంగా మారింది. తలాపున గోదారి ప్రవహిస్తున్నప్పటికీ పొలాలకు నీరందక ప్రతి ఏటా ఇక్కడ కరువు పరిస్థితులే కొనసాగేవి. సీఎం కేసీఆర్ చొరవతో సాగునీరు, కరెంటు రంగానికి భారీగా నిధులు కేటాయింటారు. దీనిని ఆసరాగా చేసుకున్న జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ప్రతిపాదన మేరకు సీఎం కేసీఆర్ అవసరమైన నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. సీఎం హామీతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ నంబర్ 27 హై లెవెల్ కాలువ నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇందులో భాగంగానే శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఎత్తిపోతల పథకానికి అంకురార్పణ చేశారు. ఈ పథకం కింద నిర్మల్ నియోజకవర్గంలోని దాదాపు 50 వేల ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగు నీరు అందనుంది. నియోజకవర్గంలోని దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి వద్ద ప్రారంభమయ్యే ఈ కాలువను ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకానికి అనుసంధానం చేసి ఇక్కడ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. కాగా ఈ హై లెవెల్ కాలువ దిలావర్‌పూర్, నర్సాపూర్, కుంటాల మండలాలతోపాటు, సారంగాపూర్, నిర్మల్, మామడ, లక్ష్మణచాంద, సోన్ మండలాల్లోని పొలాలకు వానకాలం, యాసంగి సీజన్‌లకు సరిపడే సాగునీటిని అందించనుంది. అలాగే మామడ మండలం పొన్కల్ వద్ద రూ.600 కోట్లతో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ద్వారా నియోజకవర్గంలోని 18 వేల ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగు నీరు అందనుంది. ఈ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. అంతేకాకుండా రూ.74 కోట్లతో 179 చెరువులను ఇప్పటికే పునరుద్ధరించడంతో దాదాపు 30 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతున్నది. దీంతోపాటు స్వర్ణ వాగుపై ఇప్పటికే రూ.46 కోట్లతో ఎనిమిది చోట్ల చెక్‌డ్యాంలను నిర్మించగా, తాజాగా ఇదే వాగుపై మరో ఐదు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి రూ.28 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీంతో ఓ వైపు సాగునీరు అందుబాటులోకి రాగా, మరోవైపు భూగర్భ జలాల వృద్ధికి ఈ చెక్‌డ్యాంలు దోహద పడుతున్నాయి. పశువులకు ఎండాకాలంలో కూడా తాగునీరు లభిస్తున్నది.


ఎత్తిపోతల ద్వారా కాలువల్లోకి చేరిన గోదావరి జలాలకు పూలు, పండ్లు, సారె సమర్పిస్తున్న మంత్రులు కేటీఆర్, ఐకేరెడ్డి


గోదావరి జలాలను ఎత్తిపోయడంతో కాలువలో పరుగులు పెడుతున్న నీరు

### తొలగిన కరెంటు కష్టాలు

నిర్మల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్, స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిల ప్రత్యేక చొరవ కారణంగా ఏళ్ల నుంచి వెంటాడిన కరెంటు కష్టాలకు కాలం చెల్లింది. వ్యవసాయ రంగానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న సీఎం కేసీఆర్, అదే తరహాలో నిర్మల్ నియోజకవర్గానికి కూడా వరాల జల్లు కురిపించారు. రామగుండం విద్యుత్ కేంద్రం నుంచి నిర్మల్ నియోజకవర్గానికి నేరుగా విద్యుత్ సరఫరా కోసం సోన్ మండలం వెల్మల్ బొప్పారం వద్ద రూ.1,160 కోట్లతో 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో విద్యుత్ సరఫరాకు ఏళ్ల నుంచి ఎదురవుతున్న సమస్యలన్నీ తొలగిపోయి, నాణ్యమైన కరెంటు నిరాటంకంగా సరఫరా అవుతున్నది. అలాగే రూ.10 కోట్లతో సారంగాపూర్ వద్ద నిర్మించిన 133 కేవీ సబ్ స్టేషన్‌తో మండలంలోని మారుమూల పల్లెలు, తండాలు, గూడేలకు కరెంటు కష్టాలు తొలిగాయి. కాగా, నియోజకవర్గంలోని రైతాంగానికి, ఆవాసాలకు నాణ్యమైన కరెంటును సరఫరా చేసేందుకు రూ.22 కోట్లతో 16 సబ్ స్టేషన్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇలా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలతో సాగునీటి రంగానికి 24 గంటలపాటు కరెంటును నిరాటంకంగా సరఫరా జరుగుతోంది. మొత్తానికి సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిల కృషి మేరకు నిర్మల్ నియోజకవర్గం సాగునీరు, కరెంటు కష్టాలను అధిగమించి సస్యశ్యామలంగా మారింది.


ఇటీవలే శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్



నిర్మల్‌లో ఇటీవలే ప్రారంభమైన మెడికల్ కాలేజీ

### నెరవేరిన మెడికల్ కాలేజీ కల

నిర్మల్ జిల్లాలో వైద్యరంగానికి మహర్దశ పట్టింది. సీఎం కేసీఆర్, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషి మేరకు జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కాగా, ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) అనుమతులు జారీ చేసింది. నిర్మల్ శివారులోని భీమన్న గుట్ట ప్రాంతంలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ భవనంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఇక్కడి కళాశాలలో సమకూర్చారు. సీఎం కేసీఆర్ గత సెప్టెంబర్‌లో ఈ మెడికల్ కాలేజీని అధికారికంగా హైదరాబాద్ నుండే వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కాగా, ఏళ్ల నుంచి జిల్లాలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలన్న స్థానికుల డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సీఎం కేసీఆర్ నిజం చేశారని స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు వైద్యవిద్య చేరువైందంటున్నారు. ఈసారి జరిగిన ఎంబీబీఎస్ అడ్మిషన్లలో నిర్మల్ ప్రాంతానికి చెందిన కొంత మంది విద్యార్థులు నీట్ ద్వారా మెరుగైన ర్యాంకులు సాధించి, ఇక్కడే సీట్లు దక్కించుకోవడం ఈ ప్రాంతానికే గర్వకారణంగా నిలుస్తున్నది. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటికే అభినందించారు. కాగా, మెడికల్ కాలేజీ ఏర్పాటుతో నిర్మల్ జిల్లా కేంద్రంలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులు ప్రొఫెసర్ల రూపంలో అందుబాటులోకి రానున్న కారణంగా ఇక్కడి పేద, మధ్య తరగతి ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందనున్నది.


నిర్మల్‌లో పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్లు

# ప్రగతి గడ్డకు.. ప్రజా సేవకుడు

## నేడు నిర్మల్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ

- తరలిరానున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జనం
- గులాబీ మయమైన సభా ప్రాంగణ పరిసరాలు
- భారీగా స్వాగత తోరణాలు, కౌటౌట్లు, ఫ్లెక్సీల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో తొలి సభ కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి అల్లోల



మంచిర్యాల, నవంబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. కొత్త కలెక్టరేట్‌కు వెళ్లే దారిలోని క్రశ్చర్ ఏరియాలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు జరిగే సభలో గులాబీ బాస్ పాల్గొంటారు. నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి మద్దతుగా సీఎం కేసీఆర్ సభలో ప్రసంగించనున్నారు. ఇప్పటికే సభా ప్రాంగణం దగ్గర ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయి. భారీ వేదికతోపాటు వచ్చే జనం, కార్యకర్తలు, నాయకులు కూర్చోడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. సభ చుట్టూ పక్కల ప్రాంతాలన్నీ గులాబీమయమయ్యాయి. సీఎం కేసీఆర్‌కు స్వాగతం చెప్తూ భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కొన్ని రోజులుగా దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం సభాస్థలిని మరోసారి పరిశీలించిన మంత్రి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తొలి సభ

ఎన్నికల షెడ్యూల్ వచ్చాక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ప్రజా ఆశీర్వాద సభ నిర్మల్ జిల్లాతోనే మొదలుకానుంది. రేపు(శుక్రవారం) ముథోల్ నియోజకవర్గం భైంసాలో రెండో సభ జరగనుంది. ఈ నేపథ్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు మామడ, సోన్, నిర్మల్ రూరల్, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ) మండలాల నుంచి


సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

వేలాది మంది సభకు రానున్నారు. ఈ మేరకు అవసరమైన వాహనాలను ఇప్పటికే సమకూరుస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి వాహనాలు ఉండేలా ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తున్నారు. సభ మధ్యాహ్నం ఉన్న నేపథ్యంలో వచ్చే వారికి ఎండ తగలకుండా భారీ టెంట్లు వేశారు. వచ్చిన ప్రతి ఒక్కరూ కూర్చునేలా కుర్చీలు వేయించడంతోపాటు తాగునీటి సదుపాయాలు కల్పించారు. ప్రాంగణం మధ్య మధ్యలో సౌండ్ బాక్సులు ఏర్పాటు చేశారు. సుమారు లక్ష మందిని సభకు తరలించాలనే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. సెక్యూరిటీ పరంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సభకు ఖానాపూర్, మంచిర్యాల రోడ్డు మీదుగా వచ్చే వాహనాలను నిర్మల్ అవతల బైపాస్‌రోడ్డు వరకు అనుమతిస్తారు. ఇతర వాహనాలను అక్కడి నుంచే మళ్లిస్తారు. నిర్మల్ పట్టణం నుంచి వచ్చే వాహనాలను మంచిర్యాల చౌరస్తా నుంచి డైవర్ట్ చేస్తారు. సారంగాపూర్ నుంచి వచ్చే వాహనాలు మంగల్‌పేట్ మీదుగా కలెక్టర్ రోడ్డు నుంచి సభా ప్రాంగణం దగ్గరికి చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో గురువారం మధ్యాహ్నం హెలికాప్టర్‌లో బయల్దేరి ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా నిర్మల్ చేరుకుంటారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం హెలికాప్టర్‌లో బయల్దేరి బాల్కొండలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తారు.


నిర్మల్‌లో బహిరంగ సభ వేదిక

# ప్రగతికి మోడల్ ముథోల్

## ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నేతృత్వంలో వందల కోట్లతో పనులు

- రూ.146 కోట్లతో పంచగుడి, అర్లి వంతెనల నిర్మాణం
- నిర్మల్ -నిజామాబాద్ జిల్లాలకు మెరుగైన రవాణా మార్గం
- రూ.62 కోట్లతో పిప్రి ఎత్తిపోతల పథకం
- రూ.50 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పనులు


గోదావరి నదిపై రూ.100 కోట్లతో నిర్మించిన పంచగుడి వంతెన

### అభివృద్ధి పనులు..

- రూ.46 కోట్లతో అర్లి వంతెన
- రూ.62 కోట్లతో పిప్రి ఎత్తిపోతల పథకం
- రూ.100 కోట్లతో పంచగుడి వంతెన
- రూ.50 కోట్లతో బాసర ఆలయ అభివృద్ధి
- రూ.60 కోట్లతో దాదాపు 60 గిరిజన తండాలకు రెండు విడుతల్లో బీటీ రోడ్ల నిర్మాణం
- రూ.100 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్లు
- ముథోల్, భైంసాలో రెండు మైనారిటీ స్కూళ్ల ఏర్పాటు
- 2 బీసీ, ఒక ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు
- రూ.8 కోట్లతో ముథోల్‌లో కొత్తగా 30 పడకల ఆసుపత్రి భవనం
- రూ. 20 కోట్లతో గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద కెనాల్‌ల నిర్మాణం
- 'మన ఊరు-మన బడి' కింద రూ.30 కోట్లతో 66 పాఠశాలలకు నూతన భవనాలు
- రూ.50 కోట్లతో భైంసా మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టం, డివైడర్ల నిర్మాణం
- భైంసా పట్టణంలో 660, గ్రామాల్లో 1,500 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

నిర్మల్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ) : సీఎం కేసీఆర్ సంపూర్ణ సహకారం, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నిరంతర శ్రమతో ముథోల్ నియోజకవర్గం అభివృద్ధి గమ్యాన్ని సాధించింది. ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తవడంతో ఇక్కడి ప్రజానీకమంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో తామంతా బీఆర్ఎస్ సర్కారుకే అండగా ఉంటామని, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మరోసారి గెలిపించుకొని తమ బాధ్యతను నెరవేర్చుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గతంలో పరిష్కారం కానీ సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరించారు. ముఖ్యంగా నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు వారధిగా నిలిచే పంచగుడి వంతెన నిర్మాణం ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నది. ముథోల్ నియోజకవర్గానికి నిజామాబాద్ జిల్లాను అనుసంధానం చేసే ఈ వంతెనపై నాటి పాలకులు హామీ ఇచ్చినప్పటికీ నెరవేరలేదు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. సీఎం కేసీఆర్‌కు సమస్య తీవ్రతను వివరించారు. దీంతో ముఖ్యమంత్రి గోదావరిపై పంచగుడి వద్ద వంతెన నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు కాగానే పనులు చకచకా పూర్తయి వంతెన నిర్మాణం జరిగింది. దీంతో ముథోల్ నియోజకవర్గానికి నిజామాబాద్ జిల్లా అనుసంధానమైంది. ప్రతి రోజూ వందలాది మంది ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే అర్లి చెక్క నుంచి లోకేశ్వరం మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డులో అర్లి వద్ద సుద్దవాగుపై ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన వంతెన శిథిలావస్థకు చేరుకున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన దెబ్బతినడంతో రాకపోకలు నిలిపి వేశారు. దీంతో ఇక్కడ నూతన వంతెన కోసం ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం స్పందించి వంతెన నిర్మాణానికి అవసరమైన రూ.46 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రెండు ప్రధాన వంతెనల నిర్మాణంలో ముథోల్ నియోజకవర్గంలోని కుంటాల, భైంసా, లోకేశ్వరం మండలాల ప్రజలకు అనువుగా మారింది. గతంలో ఆయా మండలాల ప్రజలు సరిహద్దులోనే ఉన్న నిజామాబాద్ జిల్లాకు వెళ్లాలంటే 60-80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఇదిలా ఉంటే నియోజకవర్గంలోని లోకేశ్వరం మండలంలో పిప్రి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం రూ.62 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో.. గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువలు, చెరువుల మరమ్మతు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పిప్రి ఎత్తిపోతల పథకం పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలో అదనంగా మరో ఐదు వేల ఎకరాలకు సాగునీరందనున్నది. దీంతోపాటు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో ఇక్కడి గిరిజన పల్లెలకు రోడ్డు రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడ్డారు. గిరిజన తండాలు, గూడేల ప్రజలు భైంసా పట్టణానికి, నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌కు రావాలంటే నానా తంటాలు పడేవారు. అలాంటిది గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతి గిరిజన పల్లెకు రోడ్డు సౌకర్యం ఏర్పడిన కారణంగా వారంతా సునాయసంగా రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు రవాణా సౌకర్యం మెరుగవడంతో పల్లెల రూపురేఖలే మారిపోయాయి.

### ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు

చదువుల తల్లి సరస్వతీ అమ్మవారి క్షేత్రమైన బాసర ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు రూ.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేయగా.. ఈ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. భక్తుల వసతి కోసం అతిథి గృహాలను నిర్మించడంతోపాటు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నీడపట్టున సేదదీరేందుకు ప్రత్యేకంగా భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రాచీన ఆలయాలను గుర్తుకు తెచ్చేలా ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. త్వరలోనే గర్భాలయ పనులు ప్రారంభం కానున్నాయి.


గడ్డెన్న వాగు ప్రాజెక్టు